# బండి కదిలింది



**విమర్శకుడుగా, కథా రచయితగా లబ్ధప్రతిష్ఠుడైన వల్లంపాటి కథలు గ్రామీణ ప్రజల కష్టసుఖాలకు అద్దం పడతాయి.**

దుమ్ము రేపుకుంటూ బస్సు కదిలింది. గావేసిన పడమటి ఆకాశాన్ని తెరలాగా కప్పిన దుమ్ము అలాగే కాస్సేపు నిలబడి, ఉండీ లేనట్టున్న గాలితెరకు నెమ్మదిగా వక్కకు తొలిగింది. తలగుడ్డతో ముఖం తుడుచుకొని, మళ్ళీ గుడ్డ తలకు చుట్టుకున్నాడు నాగన్న.

"పోదాం రారా" అన్నాడు రామప్పరెడ్డి ఇంటివైపు నడుస్తూ.

పదిమైళ్ళ దూరాన ఉన్న పట్నంలో రామప్పరెడ్డి బావమరిది కూతురి పెళ్ళి మరసటిరోజు సాయంకాలం ఎదురుకోళ్ళు. ఆ మరసటిరోజు తెల్లవారుజామున పెళ్ళి. రెడ్డి భార్య పార్వతమ్మా కొడుకూ, కోడలూ, ఇద్దరు మనవరాళ్ళూ ఓ రోజు ముందుగానే బయలుదేరారు.

"నువ్వెప్పుడు పోతావప్పా?" అన్నాడు నాగన్న.

"రేపు పొద్దు తిరిగినాక పోవాలనుకుంటా ఉండానా" అన్నాడు రెడ్డి, తల పైకెత్తి ఆకాశాన్ని చూస్తూ.

ఆషాఢమాసం వెళ్ళిపోతూ ఉంది. బాలింతల్లా పాలి పోయిన మబ్బులు ఆకాశానికేసిన మాసికల్లా నిలబడి ఉన్నాయి. తెల్లవారి నద్దిపొద్దుకే గూబలు గుయ్యిమనే ఎండ. పగిటాల అన్నం పొద్దుకే ఎండకు తోడు దుమ్మును రేపుతూ వడగాలి. రాత్రి పదిగంటలైనా ఆకాడదు. నిద్రరాదు. ఊపిరాడని ఉమ్మదం.

"నువ్వు తెల్లారికే ఎల్లిపోప్పా. ఈడ పన్లేమైనా ఉంటే నేను సూసుకుంటాలే" అన్నాడు నాగన్న.

"ఈడ చూసుకునే దానికేముందిరా. రాత్రికి వానలు పడిపోతే తెల్లారికి మడకలు కట్టిస్తావా? ఇరసాలు దున్ని చేన్లలో సెనగ విత్తనం వేయిస్తావా?" అన్నాడు రామప్పరెడ్డి.

ఆ మాటల వెనకున్న బాధ నాగన్నకు అర్థమైంది.

"ఏం సేద్యాలో, ఏం బతుకులో" అన్నాడు నాగన్న.

"పదును వాన చూసి మూడేండ్లైతే ఇంకా ఏం సేద్యాల్రా."

"ఆ ముందు మాత్రం చెరువులకు నీళ్ళొచ్చే వానలు పడి ఎంత కాలమైందప్పా? పెద్దమినను బాయి ఎండిపోయి ఎంతకాలమాయ? ఆ బాయి కింద మనం మడి నాటి ఎంతకాలమైపోయ్యా!"

రెడ్డి జవాబు చెప్పలేదు.

"ఆ బాయి కింద మన సేద్యం నిల్చిపోయినాకనే కదప్పా మా వాడు రిచ్చా తొక్కుంటానని పట్నానికి పొయ్యి..."

రామప్పరెడ్డికి మనసులో ముల్లు గుచ్చుకున్నట్టని పించింది.

నాగన్న కొడుకు రెడ్డెప్ప దాదాపు పదేళ్ళ క్రితం పట్నానికి పోయి రిక్షా తొక్కొని బతుక్కుంటానన్నాడు. వద్దన్నాడు తాను. కానీ, రెడ్డెప్ప వినలేదు. వాడూ, తన కొడుకు నాగిరెడ్డీ ఒక ఈడువాళ్ళు కలిసి పనీ పాటా చేసుకుంటూ, నేస్తంగా ఉండేవాళ్ళు. పట్నానికి వెళ్ళ వద్దురా అని రెడ్డెప్పకు వాడూ చెప్పాడు. కానీ, రెడ్డెప్ప వెళ్తానని మొండికేసి వెళ్ళనే వెళ్ళాడు... ఆరే నెలలు... పట్నంలో లారీ కింద పడి చనిపోయాడు. అంతా అయి పోయిన మూణ్ణాళ్ళ తరువాత తమకు విషయం తెలిసింది. ఎదిగొచ్చిన చెట్టంత కొడుకు పోవటంతో నాగన్న నగం చచ్చిపోయాడు. అంతకుముందే పెళ్ళాన్ని పోగొట్టుకున్న వాడికి కొడుక్కూడా పోవటంతో తనదంటూ ఏమీ లేకుండాపోయింది.

"ఔను, ఆ బాయి కింద మడి సాగి పదేండ్లయిపోయింది" అన్నాడు రెడ్డి-ఏమనాలో తోచక.

"ఆ పదేండ్లేనా?" రెడ్డి ఆలోచన వెనక్కు మళ్ళింది.

ఆ పదేళ్ళు మాత్రమే కాదు. అంతకు ముంగు పదేళ్ళు, అంతకు ముందు పదేళ్ళు. అలా తన బతుకంతా కరువు బతుకే - కరువు తరువాత కరువు.

**పుట్టిన గడ్డ మీద బతకలేక, బతుకు తెరువు కోసం పుట్టిన గడ్డను వదిలి వెళ్ళలేక అలాగే ఉండిపోయాడు తాను.**

చిత్రాలు: పి. ఎస్. బాబు



స్వాతంత్ర్యం రావటం తనకు జ్ఞప్తికి లేదు. కానీ, మొదటి రిపబ్లిక్ దినోత్సవం తనకు బాగా గుర్తే. తాను గాంధీ టోపీ పెట్టుకొని, జండా చొక్కాకు గుచ్చుకొని సాయంకాలం వరకూ ఊరంతా తిరిగాడు.

స్వాతంత్ర్యం వచ్చేసిందని పులకించిపోతా ఉన్న జనానికి కరువు చీకటిలా ముసురుకొని వస్తా ఉందని అర్థం కాలేదు. అప్పుడు తాను మదనపల్లి కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. క్లాసులో ఒకరొకరుగా కనిపించటం మానేస్తున్నారు. తన క్లాసులో బాలసుబ్రహ్మణ్యం అని ఒక అబ్బాయి ఉండేవాడు. వాడు

హైస్కూల్లో జిల్లా ఫస్టు. కాలేజీలో గూడా అన్ని సబ్జెక్ట్సులోనూ వాడే ఫస్టు. లెక్చరర్ల కందరికీ వాణ్ణి చూస్తే ఎంతో ఇష్టం. ఒక రోజు క్లాసులో వాడు కనిపించలేదు. కొంతకాలం తరువాత తెలిసింది - వాడు అప్పుడు పని జరుగుతూ ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు కూలీగా వెళ్ళాడని. ఆ సంగతి తెలిసిన లెక్చరర్ సీతారామయ్యగారు క్లాసులో కన్నీళ్ళు పెట్టుకున్నారు.

అలా నిలబడిపోయి, "డామ్ దిస్ ఫామిన్" అని పాఠం చెప్పలేకుండా తలవంచుకొని బయటకు వెళ్ళిపోయారు.

మరసటి నెలలో తాను ఇంటికి వెళ్ళాడు. ఊరి వాతావరణం, ఇంటి పరిస్థితులూ చిత్రంగా అనిపించాయి.

పెరట్లో ఉన్న పశువుల్లో సగమే కనిపించాయి.

"ఇంకో కాడెద్దులూ, పుల్లావూ, బారకొమ్ముల ఎనప పడ్డా ఎక్కడ నాన్నా?" అన్నాడు తాను.

నాన్నగారు జవాబు చెప్పలేదు. తప్పు చేసినవాడిలా తనవైపు చూశారు. మళ్ళీ అడిగాడు తను. "అమ్మేసినాముర" అన్నారు నాన్నగారు.


"ఎందుకూ?"

"మేతెక్కడుందీ?" అన్నారు నాన్నగారు.

"ఎవరికి అమ్మేసినారు?"

"పేర్నాంబట్టు, మేల్‌విషారం ప్రాంతం నుంచి సాయెబులొచ్చి కొనుక్కొని పోయినారు" అన్నారు నాన్నగారు.

**చీకటి చిక్కగా పేరుకొంది. ఊరు ఎప్పుడో మాటుమణిగిపోయింది. మేత చాలని గొడ్లు మాత్రం అప్పుడప్పుడూ 'అంబా' అని అరుస్తున్నాయి.**



తాను తన చిన్నతనం నుంచీ జొన్నకర్రలు స్వయంగా కోసుకొచ్చి మేపిన ఎద్దులూ, తనకు పాలిచ్చి పెంచిన తల్లి - పుల్లావూ, తాను వీపుమీదికెక్కి కూచుంటే పులకించిపోయే ఎనప పడ్డా ఎక్కడికెళ్ళాయో తనకు అర్థమైంది. తనకు అర్థమైందని నాన్నగారికీ అర్థమైంది.

ఆరోజు రాత్రి భోజనానికూచుంటే పింగాణీ కంచాల్లో అన్నం వడ్డించింది అమ్మ. "ఇవెప్పుడు కొనుక్కున్నారమ్మా" అన్నాడు తాను. అమ్మ జవాబు చెప్ప లేదు. "మన వెండికంచాలన్నీ అమ్మేసినామయ్యా" అన్నారు నాన్నగారు.

అమ్మ మెడను అప్పుడు చూశాడు తను. బంగారం తళతళలు లేని అమ్మ మెడ బోసిగా, భయంకరంగా ఉంది. తరువాత తానేమీ అడగలేదు, నాన్నగారేమీ చెప్పలేదు. ఇంతకాలమూ అమ్మా నాన్నా దాచిన విషయాలన్నీ క్రమక్రమంగా తనకు తెలిసొచ్చాయి.

తాను మళ్ళీ కాలేజీకి వెళ్ళలేదు...

తరువాత ఊళ్ళో గంజి కేంద్రం తెరిచారు. అంతవరకూ ఎంతో మర్యాదగా బతికిన కుటుంబాలవారు కూడా గిన్నెలూ, ముంతలూ పట్టుకొని గంజి కేంద్రాలకు వెళ్ళారు. చౌకడిపోల్లో మొట్టమొదటిసారిగా ఉప్పుచేపలమ్మారు. గంజి కూడా దొరకని వారు గేదారి ఆకూ, కలబంద గడ్డలూ ఉడకబెట్టుకొని తిన్నారు. రొక్కం చేతిలో ఉన్నవాళ్ళకు కరువు వరమైపోయింది. తిండి కోసం ప్రజలు బంగారాన్నీ పొలాల్నీ తెగనమ్ముకున్నారు. బంగారాన్ని తూచటానికి త్రాసుల అవసరమే లేకుండాపోయింది. షావుకార్లు ఇస్తానన్నదే బంగారానికి విలువైపోయింది. ప్రజలు వెల్లువలు వెల్లువలుగా పుట్టిపెరిగిన నేలను విడిచిపెట్టి వలసపోయారు. మేతలేక చనిపోయినవి పోగా మిగిలిన పశువులు ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని కబేళాలకు చేరుకున్నాయి. పొలాల్లో కంకుల్ని తిని బతికే పిట్టలు ఏమయ్యాయో ఎవరూ పట్టించుకోలేదు. కలబందల్లో, వడ్డీ వ్యాపారుల్లో మాత్రమే పచ్చదనం మిగిలింది.

ప్రజలూ, పత్రికలూ గోలచేస్తే నెహ్రూగారు కరువును చూట్టానికి వచ్చారు. కడపనుంచి చిత్తూరికి కారులో పోతూ మధ్యలో రోడ్డు పక్కనే ఉన్న ఓ గంజి కేంద్రం ముందు కారు ఆపమన్నారు.

గంజి కేంద్రం నిర్వహిస్తూ ఉన్న ఊరి పెద్ద నెహ్రూగారిని సాదరంగా ఆహ్వానించాడు.

"ఇది గంజి కేంద్రమేనా?" అడిగారు నెహ్రూగారు.

"ఔను"... అని చెప్పాడు ఊరిపెద్ద

"ఏదీ ఈ గంజి నాకు కాస్త రుచి చూపించండి" అన్నారు నెహ్రూగారు.

సెక్యూరిటీ వాళ్ళు ముందుకొచ్చేలోగా ఊరి పెద్ద శుభ్రమైన గాజుగ్లాసులో కాస్త గంజి పోసి ఇవ్వటమూ, నెహ్రూగారు కనుబొమలు ఎగరేస్తూ దాన్ని చప్పరించటమూ జరిగిపోయాయి.

"ఓహ్, గంజి ఇంత రుచిగా ఉంటుందా? ఇది బ్రిటిష్‌వాళ్ళు తాగే 'పారిజ్' లాగా ఉంది. దీన్ని తాగుతూ ఎంతకాలమైనా హాయిగా బతకచ్చు" అన్నారు నెహ్రూగారు, ఇంగ్లీషువాడు కూడా సిగ్గుపడిపోయేటంత మంచి ఇంగ్లీషులో. నెహ్రూగారి కారు కదిలిపోయాక ఆ గంజిని రుచి చూసిన చిన్న అధికారులు ఆ ఊరిపెద్ద సమయస్ఫూర్తిని ఎంతగానో మెచ్చుకున్నారు.

ఆ రోజు సాయంకాలం చిత్తూరు మెసానిక్ గ్రౌండ్సులో నెహ్రూగారు బహిరంగ సభలో ప్రసంగించారు. దుత్తల దొంతిలా ఉన్న గుట్టలూ, వాటి మీద కరువుని ధిక్కరిస్తూ పచ్చగా నిలబడటానికి ప్రయత్నిస్తున్న ఎర్రచందనం చెట్లూ, వేదికకు ఎదురుగా ఎర్రగా అస్తమిస్తున్న సూర్యుడూ, గుట్టల్ని పైటల్లా కౌగలించుకొని ఉన్న బాటలూ, గుట్టల మధ్యనుంచి బయటికొచ్చి, వేదిక వద్ద వయ్యారంగా వంపు తిరిగి ఊళ్ళోకి దూరి అదృశ్యమౌతున్న రైలుబాటా- మనోహరంగా కనిపించాయి నెహ్రూగారికి.

రెండు నిమిషాలపాటు ఆ సౌందర్యాన్ని చూసి నెహ్రూగారు పులకించి పోయారు. ఉపన్యాసం ప్రారంభించి ఆమాటా, ఈమాటా చెబుతూ "ఇంత అందమైన ప్రాంతంలో నివసిస్తూ ఉన్న మీకు ఆకలి ఎలా గుర్తుకొస్తూ ఉందో ఆశ్చర్యంగా ఉంది" అన్నారు. కారణం చెప్పటం కష్టం కానీ - ఆ మాటతో అంతవరకూ నెహ్రూగారంటే ఉన్న ఆరాధన పోయింది తనకు.

ఆ పెద్ద కరువు, దాని తరువాత ఓ చిన్న కరువు, దాని తరువాత మరోపెద్ద కరువు - ఇలా సాగుతోంది తన జీవితం. పుట్టిన గడ్డ మీద బతకలేక, బతుకు తెరువు కోసం పుట్టిన గడ్డను వదిలి వెళ్ళలేక అలాగే ఉండిపోయాడు తాను. ఇంటర్మీడియట్ వరకూ చదువుకొని, చిన్న ఉద్యోగం చేసుకొని హైదరాబాద్‌లో బతుకుతున్న తన కొడుకు నాగిరెడ్డి పరిస్థితీ అలాగే ఉంది. ఇంటి నుంచి సహాయాన్ని ఆశించలేకా, ఇంటికి సహాయం చేయలేకా బాధపడుతున్నాడు.

నున్నం పెళ్ళలు పెళ్ళలుగా రాలిపోతున్న పెద్ద ఇల్లూ, ఎండిపోయిన బావులూ, పెరిగిపోతున్న అప్పులూ, ముంచుకొస్తున్న ముసలితనం తన బతుకు.

రామప్పరెడ్డీ, నాగన్నా ఇంటివద్దకొచ్చేసరికే చీకటి పల్చ పల్చగా పరుచుకుంటోంది. ఆరబోసిన వేరుసెనగ విత్తనాల్ని ఓబిలేసు చేటల్లోకెత్తి గోతంలోకి పోస్తున్నాడు. రామప్పరెడ్డి గోతంలోనుంచి పిడికెడు గింజల్ని తీసుకొని, నాగన్నవైపు చూసి బాధగా అన్నాడు-

"వానలే రాకపోతే ఇవి ఎందుకూ పనికిరావు కదరా."

''ఔనాప్పా? ఈ గింజలు ఎందుకూ పనికిరావా?'' అన్నాడు నాగన్న.

''ఎట్ల పనికొస్తాయిరా ఏబ్రాసి మొగమూ? వాట్ని దేంట్లో తడిపినామనుకుంటా ఉన్నావు?''

''దేంట్లోనప్పా?''

''ఎండ్రిన్. అంటే విషం. అట్లా ఇట్లా విషం కాదు. కడుపులోకి పోతే దానికి మందు లేదు. చావే'' అన్నాడు రామప్పరెడ్డి.

భయపడ్డవాడిలా ముఖం పెట్టాడు నాగన్న.

''అయితే, వీటిని మనం గానిగ ఆడించుకోకూడదాప్పా'' అన్నాడు మళ్ళీ.

''గానిగ ఆడించకూడదు, పచ్చడి చేసుకోకూడదు. రెండు గింజలు నోట్లో కూడా ఏసుకోకూడదు'' అన్నాడు రామప్పరెడ్డి.

''వానల్రాకపోతే ఎట్లప్పా?''

రెడ్డి జవాబు చెప్పలేదు. వానలు రాకపోతే ఎలా ఉంటుందో ఊహించుకోసాగాడు.

కిందటేడాది ఇలాగే జరిగింది. విత్తనాలకు సెనక్కాయలు లేకపోవడంచేత మూట నాలుగువందలా యాభై లెక్కన ఆరు మూటల కాయలు కొన్నాడు. విత్తనాలకే దాదాపు మూడువేలైంది. చైత్రంలో, వైశాఖంలో వానచుక్క లేదు. జ్యేష్ఠమాసం దాటిపోతూ ఉండగా కల్లాపి చల్లినట్టుగా ఓ జల్లు పడింది. ఒకేసారి దున్నటం. విత్తటం కూడా చేశారు. దున్నటానిక్కూడా తేమ లేకపోవటం చేత సగం చేలలో విత్తనం కూడా పళ్ళేదు. విత్తనం పడ్డ చేలల్లో మొలకలొచ్చాయి. మళ్ళీ చినుకు రాల్లేదు. మొలకలు నిలువునా ఎండిపోయాయి. లేదంటే మిగిలిపోయిన విత్తనంలో కొద్దిగా ఇంటి ఖర్చుకు ఉంచుకొని, మిగిలినదాన్ని అమ్మితే వెయ్యి రూపాయలు దక్కాయి.

''వాన్రాకపోతే ఈ ఇత్తనాన్ని ఏం జెయ్యాలప్పా'' అన్నాడు మళ్ళీ నాగన్న.

''దిబ్బలో పొయ్యాల్సిందేనేమో - చిన్నరెడ్డిని అడగాల.''

''ఉండేదుణ్ణంగా ఇంత ఇత్తనాన్ని ఇసంలో ఎందుకు తడిపించినారప్పా?''

''చూడ్రా నాగా, సెనక్కాయలు ఒల్చిపెట్టి మూణ్ణెల్లయిపాయె. గింజకు పురుగు పడతా ఉంది. ఇంకా ఒక నెల్రోజులు వాన పడకుండా ఉంటే వాట్ని తీరుమానంగా పురుగులు తినేస్తాయి. అట్లకాకుండా వాటిని అట్లనే దుమ్ములో పోస్తే చెదులు తినేస్తుంది. మనవి శానా చెదులు చేన్లు కదరా? చిన్నరెడ్డి హైదరాబాదు నుంచి రాంగానే ఈ పని చేసినాడు. వాణిక్కూడా ఎంత ఇత్తనానికి ఎంత ఎండ్రిన్ కలపాలో సరిగ్గా తెలీదంట. ఎంత కలిపినాడో ఏమో.''

నాగన్నకు ఇది కొత్త సంగతి. ఇంతకుముందు విత్తనాలు చెడిపోకుండా ఉండటానికి విత్తనాల గాదెల్లో దండిగా వేపాకు వేసేవారు. ఇప్పుడు ఏవేవో కొత్త కొత్త పురుగు మందులొచ్చాయి.

''ఈ గింజల్ని తింటే ఏమవుతాదప్పా'' అన్నాడు నాగన్న.

''ప్రాణం పోతాది'' అన్నాడు రెడ్డి విసుగ్గా.

ఓబిలేసు సెనగ విత్తనాన్ని మూటలో పోసి, మూతి కట్టి వరండాలో ఓ మూల పెట్టాడు. ''దాన్ని లోపలపెట్టకూడదేంరా'' అన్నాడు నాగన్న.

''ఉణ్ణీలే - రేపు తెల్లార్తే మళ్ళా ఎండబొయ్యాల్నేమో'' అన్నాడు ఓబిలేసు.

రామప్పరెడ్డి వడసాల గదిలోంచి తిరిగి వచ్చి, వసారా ముందు మంచం మీద కూచున్నాడు. మరసటి రోజు తాను వెళ్ళాల్సిన పెళ్ళి అతని మనసులో బండిచక్రంగా తిరుగుతోంది. చిన్నరెడ్డి పెళ్ళికి తన బావమరిది అట్టహాసం పట్టపగలుగా సొంతకార్లో వచ్చాడు. పెళ్ళి కూతురికో కంచిపట్టు చీరా, పెళ్ళికొడుక్కి పట్టుపంచెలూ నలుగు పెట్టాడు. చెరో నవరను కూడా చదివించాడు.

రేపు తాను ఎలా వెళ్ళాలి? కనీసం వెయ్యిన్నూట పదార్లయినా చదివించాలి కదా? డబ్బు సర్దుబాటు చేస్తానన్న చెంగయ్యశెట్టి ఏం చేస్తాడో!

ఉన్న డబ్బంతా వేరుసెనగ విత్తనం మీద పెట్టినందుకు తన మీద తనకే కోపం వచ్చింది రెడ్డికి. విత్తనాన్ని అమ్మేస్తే... ఎవరు కొంటారు?

ఊళ్ళో అందరి వద్దా విత్తనాలున్నాయి. అందరూ విత్తనాల్ని ఇళ్ళలో పెట్టుకొని ఆకాశంవైపు ఎగజూస్తూ ఉన్నవాళ్ళే. పట్నానికి తీసుకుపోయి అమ్మేస్తే?

కానీ, చిన్నరెడ్డి విత్తనాన్ని ఎండ్రిన్‌లో తడిపించాడే! ఆ విత్తనాలు ఎందుకు పనికొస్తాయి? వాట్నెవరు కొంటారు?

ఆలోచన తెగక తల గట్టిగా పట్టుక్కూచున్నాడు రామప్పరెడ్డి.

''అన్నం తినుపోప్పా'' అన్నాడు మంచం పక్కనే కూచొని ఉన్న నాగన్న.

రెడ్డికి ఆకలి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఎప్పుడో తిన్న అన్నం. ప్రయాణం సందడిలో ఉన్న పార్వతమ్మ అంత పులుసూ, అన్నం మాత్రమే చేసింది.

''ఉండే అన్నం నువ్వు తిన్రా. నేను మా తమ్ముణింటికి పొయ్యి అన్నం తినొస్తా. అట్లే చెంగయ్యశెట్టి దుడ్డు సర్దుబాటు చేసుంటే తీసుకోనొస్తా. దుడ్డు సర్దుబాటైతే తెల్లార్తేనే పట్నం పోతా. నేను కొంచం ముందుగలగా పోతే దానికి నలుగుర్లో మర్యాదగా ఉంటాది కదా.''

నిజమేననిపించింది నాగన్నకు.

పదెకరాల మడీ, మూడు బావులూ, పదహారెకరాల చేనూ, రెండెకరాల మామిడితోటా ఉన్న రెడ్డి వెయ్యి రూపాయలకు ఇంతగా కసాలా పడటం నాగన్నకు అసహజంగా కనిపించింది.

రెడ్డి మంచం మీద నుంచి లేచి, పెరట్లో కెళ్ళి ముఖం కడుక్కొని, వడసాల్లో కెళ్ళి చొక్కా తొడుక్కొని వచ్చి తలవంచుకొని తమ్ముని ఇంటివైపుగా వెళ్ళాడు.

రెడ్డి వెళ్ళాక నాగన్నకు ఆకలి సెగలా కడుపులో లేచింది. తెల్లవారి సద్ది తాగాడు. పగిటాల అన్నం తిన్నేలేదు. ''ఒరే నాగన్నా నువ్వు అన్నం తిన్రా'' అని పార్వతమ్మ అరుస్తూనే ఉంది. కానీ, వీలుచిక్కనే లేదు...తెల్లారే వేళకే వస్తానన్న చాకలి రాలేదు. వాడి కోసం రేవుకు వెళ్ళాల్సివచ్చింది. బట్టలుతకటానికి నీళ్ళులేక రెండు రోజులుగా వాడు పడని బాధ లేదట. వాడు బట్టలు ఇస్త్రీ చేసి ఇచ్చేసరికి పొద్దు నడినెత్తికొచ్చింది. అన్నం తిందాం అనుకుంటూ ఉంటే చిన్నరెడ్డి ఓ జాబిచ్చి పక్క పల్లెలో ఉన్న తన స్నేహితుని దగ్గరికి వెళ్ళిరమ్మన్నాడు. గూబలు అదిరిపోయే ఎండలో, వడగాలికి ఎదురుగా రెండు మైళ్ళు నడిచి వెళ్ళాడు తాను. జాబు చూసిన చిన్నరెడ్డి స్నేహితుడు రెండు ఎర్రరాళ్ళ అడ్డిగలూ, రెండు జతల కమ్మలూ తన చేతిలో పెట్టి ''భద్రంరా నాగన్నా'' అన్నాడు. వాటిని తీసుకొని మళ్ళీ ఇల్లు చేరేసరికి పొద్దు వాలిపోయింది. ఆ నగల్ని చూసిన పార్వతమ్మ కళ్ళలో నీళ్ళు కుక్కుకుంది.

''ఎరవలి నగలు వేసుకోని పెండ్లికి పోవాల్సిన గతి పట్టిందిరా మనకు'' అంది ఆ తల్లి. ఆ తరువాత అన్నం తినాలనిపించలేదు తనకు.


ఇప్పుడు తినాలనిపిస్తోంది.

పెరట్లోకెళ్ళి ముఖం కడుక్కొని, వంటింట్లోకెళ్ళాడు నాగన్న.

వంటింట్లో అన్నం గిన్నెలు పెట్టే అరుగుమీద నిలబడి గిన్నెలో మూతిపెట్టి నాకుతూ ఉన్న వీధి కుక్క ఒక గెంతు గెంతి పారిపోయింది. అది పులుసు గిన్నె మీద దూకటం చేత గిన్నె దొర్లిపోయింది. అన్నం గిన్నెను చేతికందుకొని చూశాడు నాగన్న. కుక్క ఎంగిలి తేమ గిన్నెలో చారలు చారలుగా కనిపిస్తోంది. గిన్నెకంటుకున్న ఎండు మెతుకులు తప్ప గిన్నెలో అన్నం లేదు.

అసహ్యం, కోపం ఒక్కసారిగా వచ్చాయి నాగన్నకు.

తరువాత వల్పగా నవ్వుకూడా వచ్చింది.



తన ఆకలిలాంటిదే కదా కుక్క ఆకలి కూడా!

మనుషులకే తిండి దొరకని కాలంలో కుక్కలకేం పెడతారు?

అందుకే మొన్న రెడ్డోరి పెద్ద బావికాడ చింతమాను మీద కోతుల గుంపును తరమాలనిపించలేదు తనకు.

ఆ చింతమాను - ఒకే ఒక కొమ్మ - పిందె పట్టింది.

ఎక్కణ్ణుంచి వచ్చాయో కోతులు ఆ కొమ్మనెక్కేసి చిగుళ్ళనూ, కాయల్నూ లొట్టలేసుకుంటూ తింటున్నాయి.

రాళ్ళు ఏరి వాటి మీద విసరబోయాడు. కానీ, చేతులు రాలేదు.

కోతులు చింత చిగుళ్ళనూ, పిందెల్నూ తింటూ ఉంటే చూస్తూ కూర్చున్నాడు తాను. కుక్క బతుకూ అంతే.

మంచినీళ్ళు తాగి, వంటింటి వాకిలి మూసి, చిలుకు పెట్టి వచ్చి ఇంటిముందున్న పందిరి గుంజకు ఆనుకుని కూచున్నాడు.

ఆకలి మాయమైపోయినట్టనిపించింది నాగన్నకు.

కానీ, అలసటగా, మగతగా ఉంది. నిద్ర వస్తున్నట్టుగా ఉంది.

దూరాన చెప్పుల శబ్దమైతే కళ్ళు తెరిచాడు నాగన్న. రెడ్డి విసుగ్గా వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

''అన్నం తిన్నావా?'' అన్నాడు నాగన్నను చూసి.

''తిన్నానప్పా. అన్నం శానా ఉణ్ణింది. మిగిలిపోతే కుక్కక్కూడా కొంచం ఏసినా.''

"నిద్రొస్తా ఉందిరా" అన్నాడు రామప్పరెడ్డి.
"నువ్వు పోయిన పని ఏమైందప్పా?"
"కాలేదురా. చెంగయ్యశెట్టి రేపు మధ్యాహ్నానికి సర్దుబాటు చేస్తాడంట" అంటూ లేచి ఇంట్లోకి వెళ్ళబోయాడు.

తలుపు తీసుకొని లోపలికి వెళ్తున్న రామప్పరెడ్డి దృష్టి విత్తనాల మూట మీద పడింది. "ఒరే నాగన్నా నాకు రాత్రి పూట అన్నం తిన్నాక...."

"తెలుసప్పా. కానీ, ఈ గింజలు తినేదానికి పనికిరావే" అన్నాడు నాగన్న.

బాధగా చిరునవ్వు నవ్వి లోపలికెళ్ళాడు రామప్పరెడ్డి.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. ఆకాడటంలేదు. చెట్లు బొమ్మల్లా నిలబడి ఉన్నాయి. దీపాలు కూడా ఆరిపోయాయి. చీకటి చిక్కగా పేరుకుంది. ఊరు ఎప్పుడో మాటు మణిగిపోయింది. మేతచాలని గొడ్లు మాత్రం అప్పుడప్పుడూ 'అంబా' అని అరుస్తున్నాయి.

చుట్టీ మూలపెట్టిన చాప పరుచుకొని, తలగుడ్డ విప్పి దిండుగా పెట్టుకొని పడుకున్నాడు నాగన్న.

అలసటతో శరీరం తేలిపోతోందే కానీ నిద్ర పట్టలేదు. అలాగే ఇటూ అటూ దొర్లుతూ చాలాసేపు పడుకున్నాడు. ఆకలితో పేగులు చుట్టుకుపోతున్నాయి. నోరు ఎండిపోయి, నాలుక పిడచగట్టుకుపోయింది.

చాపమీద నుంచి లేచి, కడుపు నిండా మంచినీళ్ళు తాగొచ్చి పడుకున్నాడు. మళ్ళీ నిద్రపట్టలేదు. కడుపు నిండా మంచినీళ్ళున్నా ఆకలి మాత్రం తగ్గలేదు. ఇటుపొర్లీ, అటుపొర్లీ లేచి కూచున్నాడు.

అకస్మాత్తుగా లైట్లు వెలిగాయి.

కొట్టంలో ఉన్న పశువులు ఒక్కసారిగా 'అంబా' అన్నాయి.



ఆకలి. ఆకలిగా ఉంటే..." "చంపేసినావు కదరా. డాక్టరు కూడా ఊర్లో లేడుకదరా. ఏం చేసేదిరా ఇప్పుడు? పట్నానికి ఎట్ల పొయ్యేదిరా?" రెడ్డికి ఏం పాలుపోలేదు. నాగన్న తమ కుటుంబానికి కేవలం జీతగాడు కాదు.

'వాటికీ ఆకలే పాపం' అనుకున్నాడు నాగన్న

ఓపిక చేసుకొని, పశువుల పాకలోకెళ్ళాడు. తింటానికి ఏమీలేని పశువులు పెద్దకళ్ళతో నాగన్నను దీనంగా చూశాయి. అన్నీ పోగా మిగిలి ఉన్న ఒకే ఒక కాడిఎద్దుల్ని చూస్తే నాగన్నకు దుఃఖం వచ్చింది. ఎంత బలంగా ఉండేవీ ఎద్దులు! ఈగ కూచుంటే జారిపోయేటంత నున్నగా ఉండేవి. ఇప్పుడు తోలు కప్పుకున్న ఎముకల్లా ఉన్నాయి. గాట్లో వెయ్యటానికి ఏమైనా దొరుకుతుందేమోనని అటూ ఇటూ చూశాడు నాగన్న. కొండంత గడ్డివామి నేలమట్టమై చాలాకాలమై పోయింది. ఏడాదిగా సెనగ తందు కూడా లేదు. నద్దచొప్ప చూసి ఎంతో కాలమైంది...నేల మీదున్న గడ్డీగాదం బీజారి గాట్లో వేసి బాధగా తిరిగొచ్చాడు.

నడుస్తూ ఉంటే కడుపు గట్టిగా పట్టేసినట్టనిపించింది.

కాళ్ళు అదురుతున్నాయి. కళ్ళు బూజులు కమ్ముతున్నాయి.

వందిట్లోకొస్తున్న నాగన్నకు ఎదురుగా సెనగ్గింజల మూట కనిపించింది. దాన్ని చూడగానే ఇక తాను ఆకల్ని భరించలేననిపించింది. నరనరా వెళ్ళి మూట విప్పి పిడికెడు గింజలు చేతిలోకి తీసుకున్నాడు.

సెనగ్గింజలు సెనగ్గింజల రంగులో లేవు.

బూడిదలో పొర్లించిన వాటిలా ఉన్నాయి.

ఒక గింజను వేళ్ళతో నలిపితే సులభంగా పొట్టు ఊడిపోయింది.

గింజను వాసన చూశాడు నాగన్న. మామూలుగానే ఉంది.

క్షణం అనుమానించి దాన్ని నోట్లో వేసుకొని నెమ్మదిగా నమిలాడు. రుచి కూడా మామూలుగానే ఉంది.

మరో గింజా, మరో గింజా నోట్లో వేసుకున్నాడు.

ఎంతో కాలంగా మరిచిపోయిన సెనగ్గింజల రుచి నాలుక మీద జివజివా పాకింది. ఇక తట్టుకోలేకపోయాడు.

మరిన్ని గింజలు తీసుకొని, పొట్టు నలిపేసి నోట్లో పోసుకొని గబగబా నమిలాడు.

అలా నాలుగైదు గుప్పిళ్ళ గింజలు తిన్న తరువాత నాగన్నకు భయమేసింది.

'రెడ్డి ఈ గింజల్ని ఇసంతో తడిపినానన్నాడే - నేను సచ్చిపోతానేమో' అనిపించింది.

భయంతో తినటం మానేసి, పది నిమిషాలు గోడకానుకొని కూచున్నాడు. ఏమీ జరగలేదు. 'ఒకేల సచ్చిపోతే పురుగూ పుట్రా సచ్చిపోతాది. దీనికంతా మనుసులు సచ్చిపోతారా' అనుకున్నాడు.

'ఒకేల సచ్చిపోతామే అనుకో పోతే పోనీలే. బతికి ఏం సాదిచ్చాల? మేత లేకుండా ఎన్ని జీవాలు సచ్చిపోల? తాను తన చేతుల్తో మేపిన దేశపావు సచ్చిపోల? తిండి లేకుండా పట్నం పోయిన తన కొడుకు సచ్చిపోల? నేనింకా బతికుండానా? అబ్బుడే సచ్చిపోయినా. నా కొడుకుతోనే సచ్చిపోయినా...ఇప్పుడు సచ్చిపొయ్యేట్టుగా ఉంటే సెనగ్గింజలు తినే సచ్చిపోతా. దండిగా తిని సచ్చిపోతా....'

నాగన్న లేచాడు. మూట ముందు తింటానికొచ్చున్నాడు. పొట్టు నలపటం, ఊదుకోవటం వాడికి వృథా శ్రమ అనిపించింది.

ఇక తినటం వీలుకాదనేదాకా తిన్నాడు.

ఉన్నట్టుండి వెక్కిళ్ళు ప్రారంభమయ్యాయి. లేవలేకుండా లేచి పెరట్లోకెళ్ళి కడుపు నిండా మంచినీళ్ళు తాగాడు. వెక్కిళ్ళు ఆగిపోయాయి.

తిరిగొచ్చి చాపమీద కూచున్నాడు.

అప్పుడప్పుడే చల్లని పచ్చిగాలి ప్రారంభమౌతోంది. చెమటతో తడిసిన నాగన్న శరీరాన్ని గాలి హాయిగా తాకింది. చాపమీదికి ఒరిగాడు నాగన్న. ఒళ్ళు తెలియని నిద్ర అతణ్ణి క్షణంలో కౌగలించుకుంది.

పడసాల్లో పడుకున్న రామప్పరెడ్డికొక్కాడా నిద్రపట్టలేదు. రేపు చెంగయ్య శెట్టి దుడ్డు సర్దుబాటు చేసి మానం నిలబెడతాడో లేదో అన్న భయం అతణ్ణి నిద్ర పోనివ్వలేదు.... తరువాత కాస్సేపటికి లైట్లు పోయాయి. మళ్ళీ వచ్చాయి. ముంగిటి వసారాలో ఏదో చప్పుడవుతూనే ఉంది. రామప్పరెడ్డి బావమరిది కూతురి పెళ్ళిని గురించి ఆలోచిస్తూ, పైకప్పును చూస్తూ పడుకున్నాడు.

ఉన్నట్టుండి వసారాలో ఎవరో వాంతి చేసుకున్న శబ్దమైంది. గబగబా తల వాకిలి తెరుచుకొని బయటికొచ్చాడు రెడ్డి. నాగన్న వసారా గుంజను గట్టిగా పట్టుకొని వాంతి చేసుకుంటున్నాడు.

"ఏంరా, ఏం జరిగింది" అన్నాడు.

"వాంతులు అవుతా ఉండాయప్పా" అన్నాడు నాగన్న వాడి గొంతు బలహీనంగా ఉంది. ఊపిరి తీసుకోవటానికి ఇబ్బంది పడుతున్నాడు.

"ఎందుకురా?" అన్నాడు రెడ్డి.

నాగన్న జవాబు చెప్పలేదు. రెడ్డి వెనక్కి తిరిగేసరికి సెనగ్గింజల పొట్టూ, మూతి విప్పిన మూటా కనిపించాయి.

"ఆ గింజలు తిన్నావారా?" అన్నాడు రెడ్డి భయపడిపోయి.

నాగన్న మళ్ళీ జవాబు చెప్పలేదు.

"అవి విషం కదరా. ఎందుకు తిన్నావ్‌రా వెధవా?" అన్నాడు కోపంగా.

"ఆకలి...ఆకలిగా ఉంటే..."

"చంపేసినావుకదరా. డాక్టరు కూడా ఊర్లోలేడు కదరా. ఏం చేసేదిరా ఇప్పుడు? పట్నానికి ఎట్ల పొయ్యేదిరా?"

రెడ్డికి ఏం పాలుపోలేదు.

నాగన్న తమ కుటుంబానికి కేవలం జీతగాడు కాదు.

దాదాపు తమ కుటుంబంలో వాడూ ఒకడు.

పరుగెత్తుకుంటూ పోయి, ఇంటి వెనక చుట్టింట్లో నిద్రపోతూ ఉన్న ఓబిలేసును తీసుకొచ్చాడు రెడ్డి.

"బండి కట్టరా" అన్నాడు.

కొట్టంలోంచి ఎద్దుల్ని తీసుకొచ్చి బండి కట్టాడు ఓబిలేసు.

గోడకానించి ఉన్న దొల్ల తీసుకొచ్చి బండ్లో వేశాడు రెడ్డి.

తన తలగుడ్డ తీసి దొల్లలో పరిచాడు ఓబిలేసు.

ఇద్దరూ పట్టి నాగన్నను బండ్లోకెక్కించబోయారు. మళ్ళీ వాంతి చేసుకున్నాడు నాగన్న. వాంతి ఎర్రగా కుంకం కలిపిన నీరులా ఉంది.

నాగన్నను దొల్లలో పడుకోబెట్టారు.

కాడిమాను కింద దూరి, నొగ మీదికి ఎగిరి కూచున్నాడు రెడ్డి.

"ఓబిలేసూ! ఈణ్ణే ఉండు. చెంగయ్యశెట్టి వొస్తే...పొద్దులే నేనే వొచ్చేస్తానని చెప్పు."

"సరేనప్పా" అన్నాడు ఓబిలేసు.

ఎద్దుల్ని అదిలించాడు రామప్పరెడ్డి. కందెన చూసి ఎంతో కాలమైన బండిని మంచి మేత తిని ఎంతో కాలమైన ఎద్దులు కష్టపడి ముందుకు లాగాయి.

ఇంటి ముందున్న గుడ్డి వెలుగులోంచి చీకట్లో బండి కదిలింది. ■